


# మధుర శిల్పం

*మనిషికి, మనిషికి పోలికలేదు. అయినా మనిషిని పోలినమనిషి ఉంటున్నాడు. చిత్రమేః పోయినది తిరిగి రాదని అనుభవం తెలిపినా, ఆశాపాశం వదలనివారికి ఈలాంటి అనుభవం సంప్రాప్తిస్తేః*

**ఉత్తరం** చదవడం పూర్తయేసరికి మహాలక్ష్మమ్మగారి నయనాలు అశ్రుపూరితా లయాయి. నిలువునా కంపించి పోయింది. నిలబడలేక ప్రక్కనే ఉన్న మంచంమీద కూలబడింది. ఆమె చేతిలోని ఉత్తరం జారి పక్కమీద పడింది.

మహాలక్ష్మమ్మగారి బిడ్డ మధుసూదనం ఒక జమీందారుల ఇంట్లో పుట్టాడనీ, తలిదండ్రుల పేర్లూ, ఆ ఊరిపేరూ చెప్పడమే కాకుండా 'మా అమ్మలాగే ఈ అమ్మకూడా దైవభక్తురాలు' అని చెప్పాడట, మహాలక్ష్మమ్మగారి తమ్మునికి కలలో కనబడి. ఆ విషయాన్ని తెలియజేస్తూ ఆమె తమ్ముడు వ్రాసిన ఉత్తరం అది.

"మా అమ్మలాగే ఈ అమ్మకూడా దైవభక్తురాలు" అన్న మాటలే ఆమె చెవులలో మ్రోగుతున్నాయి. మధుసూదనానికి తను అమ్మ. తనుండగా తన బిడ్డకు మరొక అమ్మా! ఆ భావాన్నే భరించలేక పోతున్నది ఆమె. అయితే తాను చేయగలిగినదేమీ లేదన్న సంగతీ ఆమెకు తెలుసు. రెక్కలు కట్టుకుని అక్కడ వ్రాలాలని పించిందామెకు. "నా నాయనకు నామీద దృష్టి పోలేదు కాబోలు!" అంటూ దుఃఖం పట్టలేక ప్రక్కమీద వ్రాలి, తలగడలో తలదూర్చి వెక్కి వెక్కి ఏడుస్తున్నది మహాలక్ష్మమ్మగారు.

* * *

సామానులన్నీ లెక్కచూసుకుని బండీవాడిని పంపేసింది మహాలక్ష్మమ్మగారు. ఇల్లు సవరణలో మునిగిపోయింది.

ఆ ఊరు కావాలని బదిలీ చేయించుకున్నారు ఆమె భర్త కృష్ణారావుగారు. కొత్తగా ఆఊరు రావడం కనుక ముందుగానే ఒక స్నేహితునికి ఆ ప్రాంతంలో ఒక ఇల్లు అద్దెకు చూడమని వ్రాశారు ఆయన. వైద్యుడూ పాలే కోరాడు; రోగి పాలే కోరాడన్నట్లు ఆ ప్రాంతంలోనేగాక ఆ ఇంట్లోనే అద్దెకు భాగం దొరికింది.

ప్రస్తుతం జమీ లేకపోయినా ఆ శోభ కానవస్తూంటుంది ఆ యింటి వైఖరిచూస్తే. రెండు తరాలనాడు కట్టిన భవనం అది. అప్పుడా మేడలో ఇంటి యజమాని అమరేంద్ర, ఆయన సతీమణి సౌదామిని ఉంటున్నారు.

అమరేంద్రకు సుమారు ముప్పైఅయిదు, సౌదామనికి సుమారు ముప్పై సంవత్సరా లుంటాయి. అమరేంద్ర తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రి రెండు సంవత్సరాల క్రితం కాలం చేశాడు. చివరకాలంలో మనుమలు కావాలని సంబరించి పోయేవాడు. ఆయన ఉండగా అమరేంద్రకు సంతానమే కలుగలేదు. అమరేంద్ర సౌదామనులకు లేకలేక ఇటీవల ఒక మగ శిశువు పుట్టాడు. ఆరు మాసాల వయస్సువాడు. పేరు మహేశ్‌బాబు. అంతా 'బాబూ' అని పిలుస్తారు.

**వేదుల మీనాక్షీదేవి**

అంత ఇంట్లోనూ ఉండలేక సాయంగా ఉంటారని ఒకవైపున క్రింది భాగం అద్దెకు యిస్తున్నారు అమరేంద్ర. ఆ వాటాలోనికి కాపురం వచ్చారు మహాలక్ష్మమ్మగారు. ఆ భవనానికి వెనుకవైపున పెద్ద పెద్ద గదులతో వాటాలుగా ఇళ్ళు కడుతున్నారు అద్దెలకు ఇవ్వడానికి. ఇదివరలో అక్కడ గుర్రాలశాల, పశువుల కొట్టం, ధాన్యపు గాదెలు ఉండేవట.

బాబును కనిపెట్టుకుని పగలల్లా దాది ఉంటుంది. రాత్రిళ్ళుమాత్రం పరాయివాళ్ళను ఇంట్లో ఉంచడం ఇష్టంలేదు అమరేంద్రకు.

సౌదామిని కన్న మహాలక్ష్మమ్మగారు పెద్ద. అమరేంద్రకన్న కృష్ణారావుగారు పెద్ద. మహాలక్ష్మి దంపతులకు, సౌదామినీ దంపతులకు అచిర కాలంలోనే పరిచయం ఏర్పడింది. అందుకు కారణం బాబే!

కృష్ణారావుగారికీ, మహాలక్ష్మమ్మగారికీ బాబు మీదే ప్రాణాలు. వచ్చిన కొత్తలో ఒకనాడు రాత్రి బాబు ఏడుస్తున్నాడు. మహాలక్ష్మమ్మగారికి ఆ ఏడుపు ఎంతో బాధ అనిపించింది. వెళ్ళి సముదాయిద్దామా అనుకుంది. "కొత్తవాళ్ళు. ఏమనుకుంటారో మనంతట మనం వెడితేను. వారు పిలిస్తే వెడదాం" అన్నారు కృష్ణారావుగారు.

ఆయనకూ కంటిమీద కునుకులేదు. అంతరాంతరాల్లో 'బాబుకోసమే కదూ ఇంత దూరం వస్త' అన్న భావం మెదులుతూనే ఉంది.

పిల్లవాడు ఏడుపు మానలేదు. తల్లీ, తండ్రీ సముదాయిస్తున్నట్లు వారి కంఠాలు వినవస్తున్నాయి. బాబు గుక్క తిప్పుకోలేనంతగా ఏడుస్తున్నాడు.

మహాలక్ష్మమ్మగారు ఇక ఊరుకోలేక పోయింది. గబగబా వీధి తలుపుతీసి వీధి వరండాలోకి వచ్చింది. కృష్ణారావుగారు తమ వీధి గుమ్మానికి తాళం వేయడం, అమరేంద్ర తమ యింటి గడియతీసి "అక్కగారూ, ఓమారిలాగ వస్తారా? బాబు ఆదేపనిగా ఏడుస్తున్నాడు. ఏం తోచడం లేదు" అని పిలవడం ఒక్కమారే జరిగాయి.

"పదండి. మేమూ అందుకే వస్తున్నాం" అన్నారు కృష్ణారావుగారు. ఒక్క అంగలో మేడమీదకు వెళ్ళి ఏడుస్తున్న పిల్లవాణ్ణి చేతులలోకి తీసుకుని గుండెకు అదుముకుంది మహాలక్ష్మమ్మగారు.

అంతవరకు ఏడ్చిన పిల్లవాడు ఒక్కమారుగా ఊరుకున్నాడు. గుక్క తిప్పుకోలేక పోయాడేమోనని ఖంగారుపడి అంతా చూసేసరికి చుక్కల్లాగ కళ్ళు పెట్టుకుని చూస్తూ, మహాలక్ష్మమ్మగారి బుజాన్నంటిపెట్టేసుకున్నాడు.

"అమ్మయ్యా" అంటూ అంతా ఓనిట్టూర్పు విడిచారు.

"అక్కగారూ, మీరు రాబట్టి మా బిడ్డ మాకు దక్కాడు" అన్నాడు అమరేంద్ర కృతజ్ఞత తెలియజేస్తూ.

"దొడ్డమ్మగారు ఎత్తుకోవాలని అలా చేసి ఉంటాడు" అంది సౌదామని నవ్వుతూ.

అటువైపుగా తల తిప్పుకుని కళ్ళు తుడుసుకున్నారు మహాలక్ష్మి దంపతులు.

"నాకు అక్కగారయిన మహాలక్ష్మమ్మగారు నీకు అక్కగారెలాగ అవుతారు" అన్నాడు అమరేంద్ర భార్యతో.

"కావలిస్తే మీరే వరస మార్చుకోండి గాని నాకామె అక్కయ్యే. నేనలాగే పిలుస్తాను" అంది సౌదామని నవ్వుతూ.

గడియారం పన్నెండు కొట్టింది.

బాబు మహాలక్ష్మమ్మగారి బుజం మీదే నిద్రపోయాడు. మెల్లిగా ప్రక్కమీద పడుకోబెట్టింది. దగ్గరగా అనుకుని పడుకోమని సౌదామనితో చెప్పి వెళ్ళిపోతున్న ఆ దంపతులను ఆ రాత్రి అక్కడే ఉండమని కోరాడు అమరేంద్ర.

పిల్లవాడి ప్రక్కలో మహాలక్ష్మమ్మగారే పడుకుంది ఆ రాత్రి.

మర్నాటినుండి తీరిక సమయాల్లో మహాలక్ష్మమ్మగారు బాబుని ఎత్తుకుంటూండేది. క్రమంగా బాబు ఆమెకు చేరిక అయ్యాడు. ఆమె పనిలో ఉంటే బాబునే ఆమె వద్దకు తీసుకువచ్చేవారు. తీసుకువచ్చేదాకా ఊరుకోడు బాబు. వాళ్ల ఇంటికేసి చూపించి ఏడుస్తాడు.

బాబుకోసం మహాలక్ష్మమ్మగారింట్లో ఒక ఉయ్యాల కట్టారు. రకరకాల బూరాలు, గిలకలు, బొమ్మలు ఒకటేమిటి ఆడుకుందుకు పనికివస్తుందని తోచినవల్లా కొనితేవడమే కృష్ణారావుగారి పని. బాబుని ఒళ్లో కూర్చోబెట్టుకుని ఆయన ముచ్చట్లాడుతూంటే ఆ దృశ్యం చూసి మురిసిపోతుంది మహాలక్ష్మమ్మగారు.

బాబుకి 'అత్త', 'తాత', 'అమ్మ', 'నాన్న' అన్న మాటలు వచ్చాయి.

మహాలక్ష్మమ్మగారిని 'దొడ్డమ్మ' అను అని, కృష్ణారావుగారిని 'పెద్దనాన్న' అను అని చెప్పేది సౌదామని.

అయితే బాబుకి 'దొడ్డ' అన్న మాట రాక 'అమ్మ' అనేవాడు మహాలక్ష్మమ్మగారిని; 'పెద్ద' అన్నమాట రాక 'నాన్న' అనేవాడు కృష్ణారావుగారిని. ఆ పిలుపు హరికి కర్ణామృతం.

"బాబు ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డ" డంటాడమరేంద్ర.

బాబుకు మహాలక్ష్మమ్మగారే బొబ్బి పొయ్యాలి. బువ్వ పెట్టాలి. ఆమే నిద్ర బుచ్చాలి. మరెవ్వరూ పనికిరారు.

ఆమెకూ అదే కావాలి.

అతని సంరక్షణకు, అతనిచే "అమ్మా!" అని పిలిపించుకుందుకు తహతహలాడింది. అందుకే ఇంత దూరం వచ్చింది.

తన బిడ్డ మధుసూదనం బాబురూపంలో నిత్యం కానవస్తున్నాడు. అవే కళ్ళు, అవే ఎర్రని పెదిమలు, అదే సువర్ణచ్ఛాయ, నవ్వితే బుగ్గల సొట్టలు. అచ్చం మధుసూదనం పోలికే బాబు. అమరేంద్ర సౌదామినుల పోలికలే లేవు బాబులో.

బాబు పేరుతో తమ బిడ్డ మధుసూదనం పేరు కలిపి "మధుబాబు" అని పిలుస్తారు కృష్ణారావు దంపతులు. క్రమంగా అందరికీ ఆ పిలుపే అలవాటయింది. అందరికీ మధుబాబే ఆ పిల్లాడు.

ఆ పేరులో ఇద్దరి పేర్లు ఇమిడి ఉన్నా రూపంమాత్రం ఒక్కటే.

మహాలక్ష్మమ్మగారికీ, కృష్ణారావుగారికీ ఆ పిల్లవాడంటే పంచప్రాణాలు.

"ఏ పూర్వజన్మ సంబంధమో" అనేవారు సౌదామినీ దంపతులూ, చూడవచ్చిన చుట్టాలూ, మిత్రులూ, ఇరుగుపొరుగువారూ.


"అంతేనండి" అంటుంది మహాలక్ష్మమ్మగారు.

వచ్చే కన్నీళ్లను బలవంతంగా ఆపుకొంటుంది బాబుకి మంచిదికాదని.

బాబుకు భోగిపళ్లు పొయ్యడం, పదకొండవ నెల అన్నప్రాశన, పుట్టినరోజు, మూడవయేట కేశఖండన, అయిదవయేట అక్షరాభ్యాసం ఈ విధంగా జరిగే వేడుకల అట్టహాసమంతా మహాలక్ష్మమ్మగారింట్లో కనబడుతుంది. సౌదామినీ దంపతులు ఏ విందు లిచ్చుకున్నా, ఏ యే వేడుకలు చేసుకున్నా అవన్నిటితో ఆమెకు పనిలేదు. తానే వేరుగా చెయ్యాలి. అదే ఆమెకు ఆనందం, తృప్తీను.

తాము కాపురం ఉన్న వాటా అంతా శుభ్రంగా కడిగించి, ముగ్గులు పెట్టేస్తుంది. గడపలను పసుపుకుంకాలతో అలంకరిస్తుంది. గుమ్మం గుమ్మానికీ మామిడాకు తోరణాలు కట్టేస్తుంది. వారంరోజులు ముందునుండీ ఒకటే హడావిడి ఆమెది. చేతినిండా పని ఆమెకు. కృష్ణారావుగారు మంచి బట్టలు కుట్టిస్తారు మధుబాబుకి. ఇష్టమైన ఫలహారాలు తెచ్చిపెడతారు.

ఆనాటి ఉదయాన్నే మహాలక్ష్మమ్మగారిచేత నీళ్లు పోయించుకుందుకు వస్తాడు బాబు. పీటమీద తూర్పు దిక్కుగా బాబుని కూర్చోబెట్టి నుదుట కుంకంతో తిలకం పెడుతుందామె. ఆ సమయానికి అమరేంద్ర, సౌదామిని వస్తారు. బాబు తలమీద కోటి దీవెనలతో చమురు పెడుతుంది మహాలక్ష్మమ్మగారు.



'శ్రమజీవన సౌందర్యం'
చిత్రం—వి. ఎస్. స్వామి (గార)

హారతి వెలిగించి తానూ, సౌదామినీ కలిసి హారతి యిచ్చి, బాబు శిరస్సుపై అక్షింతలు వేస్తారు. ఆ తరువాత కృష్ణారావుగారు, అమరేంద్ర బాబుని దీవిస్తూ అక్షింతలు వేస్తారు.

బాబు తలంటి పోయించుకొని కృష్ణారావు గారి దగ్గరకు వస్తాడు. కొత్త బట్టలు తొడిగించుకుని, మహాలక్ష్మమ్మగారిచ్చిన పంచదార కలిపిన పాల గ్లాసు అందుకుని గడగడా తాగేస్తాడు మధుబాబు. అందరికీ దణ్ణాలు పెట్టి, అమరేంద్ర, సౌదామినులతో యింటికి వెడతాడు. ఆ నాడల్లా మేడలో వేడుకలు జరుగుతాయి.

ఆనాడు మహాలక్ష్మమ్మగారికి ఆనందం అర్ణవమై ఆకలే అనిపించదు.

బాబు పెంపకంలో దూరాన ఉద్యోగం చేసే కొడుకులను గురించిగాని, అత్తవారింట్లో ఉన్న ముగ్గురు కూతుళ్లను గురించిగాని ధ్యాసే లేదు మహాలక్ష్మమ్మగారికి. మధుబాబే ఆ దంపతుల సర్వస్వం అన్నట్లుండేవారు.

మధుబాబుకు ఆరవ యేడు వచ్చింది. కొద్ది కొద్దిగా చిన్న చిన్న మాటలు వ్రాయడం వచ్చింది. కూడబలుక్కుని చదవడము కూడా నేర్చాడు. బొమ్మల కథలున్న పుస్తకాలు, నీటి రంగుల బొమ్మల పుస్తకాలు, రంగుల పెట్టెలు, బ్రష్షులు ఒకటేమిటి పిల్లవాని చదువుకి కావలసిన హంగామా అంతా చేసేయడంలో కనబడ్డవల్లా కొనితెచ్చేవారు కృష్ణారావుగారు. చిన్నపిల్లవాడిలాగ బాబుతో బంతి ఆడతారాయన.

ఆయన కొనేవికాక మహాలక్ష్మమ్మగారు బాబుకోసం కొనిపించాలని తనకు ముచ్చట వేసేవి కొన్ని కొనిపిస్తుం దాయనచేత.

మధుబాబుకు ఒక తమ్ముడు, ఒక చెల్లాయి పుట్టారు. వారిద్దరితోనూ సతమతమవుతున్నది సౌదామిని.

"అక్కయ్యగారూ, ఇక బాబు సంగతి చూడ్డానికి కావడంలేదు పాపం. మీరన్నీ చూస్తూనే ఉంటారు వాడికి. నాబదులు కూడా మీరే చూడాలి యికమీదట" అనేది సౌదామిని.

"బాబు పెద్దవాడయాడు. ఎవరు చూసేందుకుమాత్రం ఏముందిలే అమ్మా" అనేది మహాలక్ష్మమ్మగారు.

లోపల ఆనందమే ఆమెకు.

ఇక పూర్తిగా బాబు తనవాడయాడు.

రాత్రివేళ ఆమె పక్కలో పడుకుని కథలు, కబుర్లు చెబితేగాని నిద్రపోడు. పని తెమలక రావడం ఆలస్యమైతే కునికిపాట్లు పడుతూ ఆమె వెనక్కాలే తిరుగుతూంటాడు 'రామ్మా' అంటూ.

"నా బాబు వస్తున్నానే" అంటూ గబగబా పని ముగించుకుని ఇవతలకు వస్తుంది ఆమె. ఆమెమీద ఒక కాలు, ఒక చెయ్యి వేసుకుని అంటిపెట్టుకుని పడుకుంటాడు మధుబాబు.

మహాలక్ష్మమ్మగారు ఎన్నో మంచి మంచి కబుర్లు చెబుతుంది. సరిగ్గా మధుసూదనానికి చిన్నప్పుడు చెప్పినట్లే ఎన్నో నీతులు, పురాణాలు కథలరూపంలో చిలవలూ, పలవలూ పెట్టి వర్ణిస్తూ చెబుతుంది. ఎంతో శ్రద్ధగా వింటాడు. నడవడికలో చక్కని పద్ధతులను నేర్పింది.

బాబు ఎప్పుడూ అబద్ధం ఆడడు. పెద్దవాళ్లు కనబడితే ఎవరూ చెప్పక్కర్లేకుండానే వారికి నమస్కారం చేస్తాడు.

ఒక్కొక్కప్పుడామె కథలు చెబుతుండగా 'ఈకథ నాకు తెలుసును' అనేవాడు. తాను తప్ప మధుబాబుకి మరెవ్వరూ కథలు చెప్పరే! ఎలాగ తెలుసునా! అని ఆశ్చర్యపోయేది మహాలక్ష్మమ్మగారు.

ఒక్కమారు చెబితే చాలు. జ్ఞాపకం ఉంటుంది బాబుకి.

"ఒక్కమాటికే ఎలాగ జ్ఞాపకం ఉంటుంది?" అని అడిగితే "నాకిదివరకే వచ్చునమ్మా. ఎక్కడో విన్నట్లనిపిస్తుంది. ఎక్కడ విన్నానో గుర్తు రావడంలేదుగాని అచ్చంగా నువ్వు చెబుతున్నట్లే ఉండేదమ్మా" అంటాడు బాబు.

రూపంలో, ఆప్యాయతలో, అభిరుచులలో, మాటలలోని వినమ్రభావంలో అంతా మధుసూదనమే మధుబాబు. తమనుంచి వేరుచేసి ఆ దైవం తీసుకుపోయిన తన బిడ్డ మధుసూదనం గుణాలన్నీ పుణికి పుచ్చుకున్నాడు మధుబాబు! రుచులుకూడా మధుసూదనానివే. తన బిడ్డ మధుసూదనం కోరి వండించుకునే పదార్థాలను వండితే మధుబాబు ఎంతో ఇష్టంగా మళ్ళీ మళ్ళీ వేయించుకుని తింటాడు. అలాంటి మధుబాబుకి మధుసూదనం విజ్ఞానంకూడా సంక్రమించిందా!

నిర్విణ్ణులయే వారా దంపతులు.

"మాతండ్రీ" అంటూ వారు మధుబాబుని హృదయానికి హత్తుకునేవారు. జలజల కన్నీరు ప్రవహించేది వారికి.

మధుబాబు తెల్లబోయి చూసేవాడు. వారి హృదయాలలోని ఆవేదన మధుబాబుకే కాదు, ప్రపంచంలో మరే వ్యక్తికీ అర్థం కాదు. మధుబాబు తన బిడ్డే అన్న తృప్తి వారిలో కనబడుతుంది.

'ఎంత పెంచినా మన బిడ్డ ఎలాగ అవుతాడు? అమరేంద్ర సౌదామినుల బిడ్డడు అంటుందిగాని మన బిడ్డడు అని అనదు లోకం. ఎప్పటికైనా తాము తమ స్వస్థలానికి వెళ్ళక తప్పదు. మధుబాబు ఇక్కడే ఉంటాడు. బాబును తీసుకు వెళ్ళడానికి తమకు హక్కులేదు' అన్న భావం కలిగేటప్పటికి వారి దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహిస్తుంది ఉప్పెన వచ్చినట్లు.

మధుబాబు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షకు వెళ్ళబోతున్నాడు. ఒకనాడు మహాలక్ష్మమ్మగారు తన బట్టల పెట్టె సవరించుకుంటూ పట్టు చీరల మడతలమధ్య ఫోటోలను చూస్తున్నది తీసి. ఆమె చేతిలో ఉన్నది వాళ్ళ కుటుంబం అంతా తీయించుకున్న ఫోటో. అదే సమయానికి మధుబాబు వచ్చేడు. ఆ ఫోటో చూశాడు. మహాలక్ష్మమ్మగారినీ, కృష్ణారావుగారినీ ముందే పోల్చుకున్నాడు. వారి నలుగురు కొడుకులూ, ముగ్గురు కూతుళ్ళూ ఉన్నారా ఫోటోలో. వారి కేసి తేరిపార చూశాడు.

"వీళ్ళందరినీ ఎక్కడో చూశానమ్మా" అన్నాడు బాబు.

"ఎందుకలాగ తోస్తోంది?" అంది మహాలక్ష్మమ్మగారు.

"వీళ్ళునాకు బాగా పరిచయం ఉన్నవాళ్ళమ్మా. ఎక్కడో గుర్తుకు రావడం లేదు" అని జ్ఞాపకం చేసుకుందుకు ప్రయత్నిస్తుండగా మహాలక్ష్మమ్మగారి ఒడిలో ఉన్న మధుసూదనం ఫోటో మీద అతని దృష్టిపడింది.



'కోలో యన్న కోలో'

చిత్రం — బి. సుగుణాబాయి (కరీంనగర్)


సరిగ్గా మధుబాబు వయస్సువాడై ఉండగా తీయించిన ఫోటో అది. సరిగ్గా అలాగే ఉన్నాడు మధుబాబు.

"నాకు తెలియకుండా ఎప్పుడు తీయించావమ్మా ఈ ఫోటో? అమ్మ దొంగా!" అన్నాడు బాబు ఫోటోని చేతులోకి తీసుకుంటూ. ఆమె స్తబ్ధురాలైంది.

మహాలక్ష్మమ్మగారికి ఏమనడానికీ మాట రాలేదు. రెప్పార్పకుండా బాబుని, మధుసూదనం ఫోటోని చూస్తున్నది.

ఇద్దరూ ఒకేరూపు! ఇదివరలో తన దృష్టిలో ఏక రూపు వారిద్దరిదీను. ఆ సంగతి యిప్పుడు స్పష్టమయింది. మూర్తీభవించిన విగ్రహమే అయిందామె అంటే అతిశయోక్తి కాదు.

ఆ సమయంలో ఆ మాతృ హృదయంలో ఎన్ని తుపానులు చెలరేగాయో, ఏ అగ్నిపర్వతాలు బద్దలయాయో ఆ పరమేశ్వరునికే యెరుక.



తన తమ్ముడు వ్రాసిన విషయం ముమ్మాటికీ నిజం. తన బిడ్డ మధుసూదనంమధుబాబై పుట్టాడు. పునర్జన్మ అనేది ఉందంటారు. ఎక్కడో పుట్టే ఉంటాడనుకుంటున్న తమ్ముడు వ్రాసిన విచిత్ర సమాచారం అందరినీ విభ్రాంతును చేసింది. తన మధుసూదనం ఏరూపంలో ఉన్నా తనకు కావాలి. ఆ బిడ్డ సమీపంలో తాను ఉండాలి. అప్పుడే తన మనస్సుకి శాంతి. హృదయానికి నిండు. భర్తతో చెప్పింది. ఫలితం? ఆఊరు బదిలీ చేయించుకుని కాపురం మార్చారు ఆ దంపతులు.

కృష్ణారావుగారు రిటైరయి ఆరు సంవత్సరాలైంది. ఆరేళ్లనుంచి ఎప్పటికప్పుడు తమ స్వస్థలానికి వెళ్లిపోవాలనుకుంటున్నా, మధుబాబుని విడిచి వెళ్లలేకపోతున్నారు. పిల్లల దగ్గరనుంచి 'రమ్మని' ఉత్తరాలమీద ఉత్తరాలు వస్తున్నాయి. పైగా పెద్ద వయస్సులో పిల్లలకంత దూరాన ఉండడం మంచిదని కాదు కూడాను. అందుచేత ఇక వెళ్లక తప్పదు.

పగలల్లా మనుష్యుల్లాగ తిరుగుతున్నారు. కాని, రాత్రి కంటిమీద కునుకు లేదు. నోటికి మెతుకు పోదు.

మధుబాబు మామూలుగా మాట్లాడుతాడు. వారు మామూలుగా మాటలాడలేకపోతున్నారు. వారి గొంతుక మూగపోతున్నది. ఎలాగో మాట్లాడుదామంటే కంఠం రుద్ధమవుతున్నది. బాబు ఎదురుపడితే పక్కగా తిరిగి కళ్లు ఒత్తుకుంటారు.

"ఏం అమ్మా అలా ఉన్నారు?" అంటాడు బాబు.

"ఏం? మామూలుగానే ఉన్నామే. ఎందుకిలాగ తోచింది నాన్నా" అంటుంది మహాలక్ష్మమ్మగారు.

ఆ మాట నిజంకాదని ఆమెకూ తెలుసు.

ఇప్పుడేకాదు. ఎప్పుడైనాసరే మామూలుగా కాకుండా ఏమాత్రం తేడాగా కనబడినా బిక్కమొహం వేసేస్తాడు. హడలిపోతాడు తనవల్ల తప్పుందేమోనని. రకరకాలుగా మాట్లాడి వారిని సంతోషపెట్టజూస్తాడు. 'మా మూ లు గా మాట్లాడేవరకు తహతహలాడతాడు. కాలు కాలిన పిల్లిలాగ తిరుగుతాడు. పిచ్చి తండ్రి' అనుకుంటారు కృష్ణారావు దంపతులు.

వారి ప్రయాణం ఇక నాలుగు రోజులుంది.

పోనీ తమతోబాటు తీసుకువెళ్లి పది రోజులు తమ ప్రాంతాలన్నీ చూపించి, తనవారిని చూపించి మళ్లీ పంపవచ్చు బాబుని. అమరేంద్ర సోదామిని కూడా అభ్యంతరం చెప్పరని తెలుసును వారికి. తీరా తీసుకునివెళ్లి "వీడు మీ అన్న మధుసూదనం" అంటే వాళ్లెలాగ నమ్మగలరు? వాళ్లేకాదు. ఎవ్వరూ నమ్మరు. బాబు వాళ్లందరికన్న చిన్న. మధుసూదనం బ్రతికి ఉంటే ఇప్పుడు నలభై యేళ్లు దాటుతాయి. ఆ తరవాత వాళ్ళే మిగిలిన పిల్లలంతా. పెరిగి పెద్దవాడైన ఆ బిడ్డ ఎక్కడ? మధుబాబు ఎక్కడ? తలయెత్తి చూడవలసిన విగ్రహం మధుసూదనంది. మధుబాబుని ఎంత మమకారంతో చూసినా ఆ మధుసూదనం ఎలా అవుతాడు? ఆ బిడ్డ మళ్లీ ఎలా వస్తాడు? సంసారంలో ఆ నిండు ఇక ఈ జన్మకు ఎలా వస్తుంది?

రాదు. ఈ లోటు తీరేదికాదు. ఇది ఒక పెద్ద అగాధం.

అయితే మధుబాబులో తన బిడ్డ రూపాన్ని చూసుకుంటూ, ఆ పిలుపు, మాటలు, చేష్టలు నానివిగానే తలచుకుంటూ తృప్తిపడుతున్నది తను. పదిహేను ఏళ్లనుండి మధుబాబే సర్వస్వం అయాడామెకు.

బాబుని తీసుకువెళ్లి ప్రయోజనం లేదు. చూడాలని ఉంటే తామే వచ్చి చూడవచ్చు అన్న నిశ్చయానికి వచ్చారు వారు.

వారి ప్రయాణం సంగతి బాబుకు తెలిసింది. గబగబా పరిగెత్తుకునివచ్చి "అమ్మా, నన్ను విడిచి వెళ్లిపోతున్నారా మీరిద్దరూ?" అంటూ కౌగలించుకుని బేరుమన్నాడు.

ఆమె మనస్సు స్వాధీనం తప్పింది. రెండు చేతులతో బాబును హృదయానికి గట్టిగా హత్తుకుంది.

"ఎక్కడికీ వెళ్లను బాబూ. వెళ్లను. వెళ్లలేను. నా తండ్రీ, నిన్ను విడిచి ఒక్క అడుగు వెయ్యలేను. ఒక్క క్షణం బ్రతకలేను. ఏడవకు. నా బాబు కదూ. ఏడిస్తే నేను సహించలేను. నా మధుబాబు నిత్యం ఆనందంగా నా కళ్లకు కనబడుతూ ఉండాలి. అదే నా జీవితానికి ఆధారం" అంది మహాలక్ష్మమ్మగారు.

"అలా అంటావంతే. వెళ్లిపోతావు. నాకు తెలిసింది" అంటూ మధుబాబు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"నా మధుబాబు కదూ, నేనెక్కడికీ వెళ్లను. వెళ్లను. ముమ్మాటికీ వెళ్లను" అంటున్నది మహాలక్ష్మమ్మగారు.

"ఎక్కడికమ్మా వెళ్లనంటున్నావు?" అంటూ ఆమెను తట్టి పిలుస్తున్న ఆమె కడసారపు అమ్మాయి సరోజిని పిలుపు విని కళ్లు తెరచి విచిత్రంగా చూస్తున్నది మహాలక్ష్మమ్మగారు.

ఆమె కన్నీటితో తలగడతోబాటు తమ్ముడు వ్రాసిన ఉత్తరముకూడా తడిసిపోయింది. ★